విద్యార్థుల రక్తదానం

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఎల్.జి.గ్రాండ్ యునైటెడ్ వే ఆఫ్ ముంబయి వారి సౌజన్యంతో డాక్టర్ రాజేష్ నిర్మాన్ ఆర్గనైజేషన్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ సురేందర్‌రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం తయారవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్రపాటిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో కొమిరిశెట్టి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం పరామర్శించారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తల్లి కొమిరిశెట్టి అరవిందబాయి బుధవారం రాత్రి మృతి చెందారు. కొన్నాళ్ళుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది.ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుమారులు సాయిబాబా, రాజు, కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో నూతన ఆవిష్కరణలు రావాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ ఫార్మసి ఎడ్యుకేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఫార్మా అన్వేషణ్-2025 పేరిట ఫార్మా ఎంటర్‌ప్యూనర్‌షిప్, స్టార్టరప్‌పై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఫార్మా రంగం భారత దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా కీలక పాత్రను కలిగి ఉందని తెలిపారు. మెడికల్ రంగంలో యువత ఔత్సాహికులు నూతన అన్వేషణలు, స్టార్టరప్ ప్రారంభించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సరోజినీ నాయుడు ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ ప్రభాశంకర్, వివిధ సంస్థల ప్రతినిధులు కె.బాలరాజు, గొల్ల సునిల్, డాక్టర్ నందన్‌కుమార్, రఘువీర్, ఎ.కార్తిక్‌రావు, నాగేశ్వర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గోల్కొండ: కులమతాలకు అతీతంగా నిరుపేదలకు, వితంతువులకు నిత్యావసర సరుకులు అందించడం దేవుడు ఇచ్చిన వరమని గోల్కొండ జగదాంభిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి అన్నారు. గురువారం ఆయన మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారితో కలిసి గోల్కొండ రిసాలాబజార్‌లో నిరుపేదలకు, పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

అఫ్జల్‌గంజ్: దారుసలాం నుంచి గోషామహల్ చౌరస్తా వరకు రోడ్డుకు మధ్యలో ఉన్న హైటెన్షన్ వైర్లను, విద్యుత్ స్తంభాలను వెనక్కి జరిపి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని గోషామహల్ బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం విద్యుత్ శాఖ సీఎండీ ముషరఫ్ ఫారూఖీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌలిగూడలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ..దారుసలాం నుంచి గోషామహల్ చౌరస్తా వరకు హైటెన్షన్ వైర్లు, విద్యుత్ స్తంభాలు రోడ్డుపై ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. స్థానిక ప్రజలు, స్థానిక వ్యాపారాలు ట్రాఫిక్ సమస్యతో నరకం చూస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని సీఎండీ ముషరఫ్ ఫారూఖీ హామీ ఇచ్చినట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు.

అమ్మాయిలను వేధిస్తున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన అక్రమ్ (35) భవానీనగర్ స్టేషన్ పరిధిలో అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు అక్రమ్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం అక్రమ్‌ను గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా పూర్వపరాలను పరిశీలించిన ఇన్‌చార్జి స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ నిందితుడు అక్రమ్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం!

మరో నాలుగు పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు సన్నద్ధం

- ప్రభుత్వానికి ప్రతిపాదించిన పోలీసు ఉన్నతాధికారులు
- వచ్చే బడ్జెట్‌లో మంజూరుకు సన్నాహాలు
- జూన్ వరకు ఏర్పాటుకు రంగం సిద్ధం?


నార్సింగి పోలీస్‌స్టేషన్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రోజురోజుకూ జనాభా పెరిగిపోతోంది. అందుకు అనుగుణంగానే నేరాలు, కేసుల సంఖ్య కూడా పెరుగుతోంది. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏకంగా సంవత్సరానికి దాదాపు 2 వేల కేసులు నమోదు అవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అందులో ఎక్కువగా భార్యాభర్తల తగాదాలతో పాటు ఆర్థిక, సెలబ్రిటీలు, ఐటీ ఉద్యోగుల కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. జనాభాకు అనుగుణంగా ఇప్పటికే నార్సింగి కేంద్రంగా ఏసీపీ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న జన్వాడ, మిర్జాగూడలను కొత్తగా వచ్చిన మోకిల స్టేషన్ పరిధిలోకి మార్చారు. ప్రస్తుత నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో ఒకటి, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని కొంత భాగంతో ఐటీ జోన్ కేంద్రంగా మరో కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది.

- కోకాపేట నియోపోలీస్‌లో శరవేగంగా నిర్మాణాలు, ఐటీ సంస్థలు వస్తుండటంతో జనాభా పెరిగిపోతుంది. అనేక రాష్ట్రాల వారే కాకుండ ఇతర దేశాల వారు సైతం వచ్చి ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దాంతో కొత్తగా కోకాపేట పేరుతో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.
- పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో ఔటర్ రింగ్ అవతలి ఐటీ జోన్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ఓ పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. వీటితో పాటు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న బండ్లగూడ పోలీస్‌స్టేషన్, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సులేమాన్‌నగర్ కేంద్రంగా మరో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు.
- దాంతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కొత్తగా మరో నాలుగు పోలీస్‌స్టేషన్‌లు రాబోయే బడ్జెట్‌లో మంజూరు అయ్యే అవకాశం ఉందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.
- ఇప్పటికే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా ఉన్న ఔట్‌పోస్టును పూర్తి స్థాయి పోలీస్‌స్టేషన్‌గా ప్రకటించి ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి త్వరలోనే మరిన్ని పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు.

మారనున్న పరిధి...

- నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కోకాపేట, గండిపేట, ఖానాపూర్ గ్రామాలు కొత్తగా వచ్చే కోకాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తేనున్నట్లు సమాచారం. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న వట్టినాగులపల్లి, నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పుప్పాలగూడ ఐటీ జోన్ ప్రాంతంతో కలిపి గౌలిదొడ్డి, సైబరాబాద్ ఐటీ జోన్ పోలీస్‌స్టేషన్ పేరుతో కొత్త స్టేషన్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఇక నార్సింగి, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న కిస్మత్‌పూర్, బండ్లగూడ, హిమాయత్‌సాగర్‌లతో బండ్లగూడ కేంద్రంగా మరో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానుంది.
- అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లను కలిపి కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. త్వరలోనే కొత్తగా పోలీస్ సిబ్బంది నియామకం చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతుందని, అందుకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ఎస్ఈ శ్రీరామ్‌మోహన్


గగన్‌పహాడ్‌లో నూతన ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రీరామ్‌మోహన్

మైలార్‌దేవ్‌పల్లి: వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ డి.శ్రీరామ్‌మోహన్ అన్నారు. గగన్‌పహాడ్, లక్ష్మీగూడ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఫీడర్ల లోడ్‌ను విభజించి నూతనంగా ఫీడర్లను ఏర్పాటును డిఈ రత్నాకర్‌రావు, డీఈ (కన్‌స్ట్రక్షన్) చంద్రశేఖర్, డీఈ(లైన్స్) చంద్రశేఖర్, డీఈ (ప్రొటెక్షన్) భాస్కర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నిరంతరం, నాణ్యమైన విద్యుత్ అందించాలని సంకల్పంతో నిధుల కొరత లేకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి సదుపాయాలు కల్పిస్తుందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రతి సెక్షన్‌లో విద్యుత్ ఫీడర్లను నూతనంగా ఏర్పాటు చేసి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారన్నారు. డీఈ రత్నాకర్‌రావు మాట్లాడుతూ... వినియోగదారులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలకు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్న వినియోగదారులు సకాలంలో చెల్లించి సంస్థకు తోడ్పాటు అందించాలన్నారు. గగన్‌పహాడ్ సబ్ డివిజన్ ఏఈడి ఈశ్వర్‌ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు రవీందర్, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా టిప్పర్ల రాకపోకలు


బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వైపు వెళ్తున్న నెంబర్ ప్లేట్ లేని టిప్పర్ వాహనం

బండ్లగూడ: మట్టి ఇతర భవన నిర్మాణ వ్యర్థాలను తరలించే టిప్పర్ వాహనాల రాకపోకలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రమాదకరంగా నడుస్తున్నా... పెను ప్రమాదాలు సంభవిస్తున్నా వాటి నివారణకు అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తరచు అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కొందరు మట్టిని తరలించే భారీ టిప్పర్ల యజమానులు అతివేగంతో వెళ్లడంతో పాటు మట్టి ప్రజలపై పడకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వెల్లడిస్తున్నారు. ఈ వాహనాలకు నెంబర్ ప్లేట్లు సైతం ఉండటం లేదు. వీరి వేగానికి ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని మట్టిని తరలించే సమయంలో లారీలపై నుంచి దుమ్ములేవకుండా ఉండేందుకు కవర్లు కట్టడం లేదన్నారు. ఈ కారణంతోనే వెనుక వస్తున్న ద్విచక్ర వాహనాదారులు మట్టి కంట్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఇకనైనా ఈ టిప్పర్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు అండగా మజ్లిస్

గోల్కొండ: దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయనను గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మజ్లిస్ సీనియర్ నాయకుడు మహ్మద్ జాహెద్ చోటా బజార్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులందరికీ తాను అండగా ఉంటానన్నారు. అదే విధంగా బల్దియా నుంచి దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఇప్పించామన్నారు. చాలా మంది దివ్యాంగులు నేడు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు వజీఉజ్జమా, హబీబ్ చౌస్, సలీం తదితరులున్నారు.

స్థిరమైన అభివృద్ధిని సాధించాలి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొ. శ్రీనివాసమూర్తి


సదస్సు సావనీర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్, అతిథులు

రాయదుర్గం: స్థిరమైన అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాసమూర్తి అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సందర్భంగా సమకాలీన వ్యాపార పద్ధతులు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో కార్పొరేట్ పాత్రను ఆయన ఎత్తిచూపారు. సెంట్రల్ సివిల్ సర్వెంట్, ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్టమైనదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పటిష్టమైన చర్యలు చేపట్టడంతో ఆర్థిక వ్యవస్థ ఎదుగుతూనే రాబోయే రోజుల్లో ప్రపంచ స్థాయిలో తనదైన గుర్తింపు సాధించడం ఖాయమన్నారు.అనంతరం సదస్సు సావనీర్‌ను వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ విడుదల చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్, మనూ స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ బదియుద్దీన్ అహ్మద్, విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, సదస్సు కన్వీనర్ డాక్టర్ సయ్యద్ ఖాజా సఫీయుద్దీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిస్సార్ హుస్సేన్, డాక్టర్ ఎం.డీ. రషీద్ ఫారూఖీ ప్రసంగించారు.

19 నుంచి నిథమ్‌లో ఇంటర్ కాలేజ్ కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్-2025

రాయదుర్గం: నిథమ్‌లో ఈనెల 19 నుంచి 21 వరకు ఇంటర్ కాలేజ్ కల్చరల్ ,స్పోర్ట్స్ ఫెస్ట్-2025 జరగనుంది. నగరంలోని డిగ్రీ, పర్యాటక, అతిథ్య కళాశాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. 19వ తేదీన నిథమ్‌లో ఫొటోగ్రఫీ, రీల్స్, మిల్లెట్స్ కుకింగ్, గ్రూప్ డ్యాన్స్ పోటీలను నిర్వహిస్తారు. 20వ తేదీన చెస్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, ఖోఖో, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలను నిర్వహిస్తారు, 21వ తేదీన టీషర్ట్ పెయింటింగ్, క్విజ్ పోటీలను నిర్వహిస్తారు. అనంతరం బహుమతుల ప్రదానం ఉంటుంది. అదేరోజు రాత్రి మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో బ్యాండ్, డీజే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23000472 /473/454, 040-23000471లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

చేతిరాత పోటీల్లో విద్యాశ్రీ హైస్కూల్‌కు 180 అవార్డులు

జియాగూడ: తెలంగాణ రాష్ట్ర స్థాయి చేతి రాత పోటీల్లో జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్ విద్యార్థులు 180 అవార్డులను గెలుచుకున్నారని విద్యాశ్రీ హైస్కూల్ చైర్మన్ శ్యామ్ వెరా అన్నారు. గురువారం స్కూల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇటీవల అక్షర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో వివిధ స్కూళ్లల్లో సుమారు 12000 మంది విద్యార్థులు చేతిరాత పోటీల్లో పాల్గొనగా 180 మంది విద్యార్థులు గెలిచారని, వీరందరికీ 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ ఆడిటోరియంలో అక్షర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ వారు సర్టిఫికెట్లు, మెడల్స్‌లను బహూకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కుల్సుంపురా ఏసీపీ మునావర్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ యూత్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పన్ను బకాయిలను సకాలంలో చెల్లించండి

బహదూర్‌పురా: ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలో ప్రాపర్టీ టాక్స్ వసూళ్లను వంద శాతం పూర్తి చేసే దిశలో చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్-10 డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి అన్నారు. పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు సిబ్బందితో వివరిస్తున్నారు. పన్ను చెల్లింపులలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలు నిర్ణీత సమయంలోపల ప్రాపర్టీ టాక్స్‌లు చెల్లించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు, సర్కిల్-10 కార్యాలయం చాంబర్‌లో ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. టాక్స్ విషయంలో ప్రజలు తమకున్న సమస్యలను అనుమానాలను ఈ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో దృష్టి సారించారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం

అఫ్జల్‌గంజ్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం కొనసాగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏఐసీసీ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి గీతారెడ్డి గురువారం గాంధీభవన్‌కు వచ్చిన సందర్భంగా ఆమెను పోల్కం శ్రీనివాస్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అందరి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. వెంటనే మేరు కులస్తుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యతోపాటు నచ్చిన రంగంలో రాణించాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కులకర్ణి శశికాంత్

మణికొండ: విద్యార్థులు చదువులతో పాటు తమకు నచ్చిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలోను పాల్గొని తమ సత్తా చాటాలని ఉస్మానియా యూనివర్శిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కులకర్ణి శశికాంత్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో మూడు రోజుల వార్షిక సాంస్కృతిక, క్రీడా ఫెస్ట్ 'శృతి-2025'ను ఆయన గురువారం ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు స్పోర్ట్స్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... చదువుతో పాటు ఇతర రంగాలలోనూ రాణించే అవకాశం ఎంతో ఉందన్నారు. జీవితంలో రాణించాలంటే మనసుకు నచ్చిన పనిచేసినపుడే అది సాధ్యం అవుతుందన్నారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు రోజుల పాటు జరిగే శృతి-2025లో క్రీడలు, సంగీతం, నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇంటర్ డిపార్ట్‌మెంట్, ఇంటర్ కాలేజీల మధ్య పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. అకడమిక్ డైరెక్టర్, శృతి చైర్మన్ ప్రొఫెసర్ పి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఏ,పీ డైరెక్టర్, శృతి కో చైర్మన్ బి.లింగారెడ్డి, ప్రొఫెసర్‌లు జి.లక్ష్మయ్య, డాక్టర్ జి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బోర్లను అరికట్టాలి


సాయిగౌతమ్ సమస్యలు తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: చెరువుల పక్కన అక్రమంగా బోర్లు వేసి, చుట్టు పక్కల వారి బోర్లలో నీరు వట్టిపోయేలా చేయటంతో పాటు కలుషిత నీటిని ప్రజలకు సరఫరా చేసి రోగాలపాలు చేస్తున్న వారిపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా సాయిగౌతమ్ నగర్ కాలనీ, ముష్కి చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముష్కి చెరువు చుట్టు పక్కల పెద్ద ఎత్తున బోర్లు వేసి కొందరు జోరుగా నీటి వ్యాపారం చేస్తున్నారన్నారు. చెరువు చుట్టు పక్కల నివాసితులకు దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రజలు నివసించే చోట కమర్షియల్ హోటళ్లకు అనుమతులు ఇవ్వటంతో వాటి నుంచి వచ్చే పొగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు శ్రీకాంత్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, భానుచందర్, శ్రీధర్, ప్రవీణ్, సుమళిని తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన


ఆరాంఘర్ చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

అత్తాపూర్: ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆరాంఘర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్స్‌కు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే ఆటోలను నడపవద్దని తెలిపారు. వెహికిల్స్‌కు నెంబర్ ప్లేట్లు నాలుగు వైపులా ఉండాలన్నారు. సరైన వాహన దస్తావేజులు లేకపోతే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రోడ్డు పక్కన, బస్టాప్‌లలో ఆటోలను ఆపవద్దని సూచించారు. ఆటోలను రోడ్లపై ఆపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. కొంత మంది ఆటో డ్రైవర్లు బస్టాప్‌లలోనే ఆటోలను నిలుపుతున్నారని దీని కారణంగా ఆర్టీసీ బస్సులు స్టాప్‌లలో ఆపకుండా వెళ్తున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు అంతా ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు


నార్సింగిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

మణికొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు మల్కా కొమరయ్య, అంజిరెడ్డిలు గెలుపొందటంతో ఆ పార్టీ నాయకులు గురువారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో విజయోత్సవాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కె. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీజేపీ అభ్యర్థులు సత్తాచాటుతారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో విసుగెత్తి బీజేపీని గెలిపించేందుకు సిద్ధమయ్యారన్నారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్, నాయకులు భిక్షపతి యాదవ్, శివరాజ్, బుచ్చిరెడ్డి, సాయికిరణ్, కృష్ణ, జైదీప్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.


పెళ్లికి నిరాకరించిన ప్రియురాలు...
ప్రేమికుడి ఆత్మహత్యాయత్నం

బిల్డింగ్ మొదటి అంతస్తు ఎక్కి దూకుతానని హల్‌చల్


యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రేమించిన యువతి ఇంటి ముందు ప్రేమికుడు ఆత్మహత్యయత్నం చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు సమాచారం మేరకు... బాగ్‌లింగంపల్లి ప్రాంతానికి చెందిన సోను(21) డిగ్రీ చదువుతున్నాడు. లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ, బృందావన్ కాలనీకి చెందిన అంబిక(21) ఎల్ఎల్‌బీ చదువుతుంది. ఇద్దరు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ప్రియురాలు ప్రియుడిని కాదనండంతో మనస్థాపానికి గురై గురువారం ప్రియురాలు ఇంటి ముందు ఉన్న మొదటి అంతస్తు పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. ఈ సమయంలో తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో కోసుకొని ఫ్లోర్ క్లీనర్‌ను తాగాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే 108కి ఫోన్ చేసి అంబులెన్స్‌లో అతనికి ప్రథమ చికిత్స చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



గోల్కొండ: ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ విద్యా బోధన జరుగుతుందని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీలక్ష్మి అన్నారు. గురువారం కళాశాలలో అనుదీప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తమ వద్ద డిగ్రీ పూర్తి చేసుకున్న వారిలో చాలా మంది మంచి ఉద్యోగాలు సంపాదించారన్నారు. దిగ్గజ కంపెనీలు తమ కళాశాల క్యాంపస్‌కు వచ్చి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు చేస్తున్నాయన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ మేనేజర్ లకావత్ సాగర్ మాట్లాడుతూ..ఈ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించడం తమకు కొత్త అనుభూతి కలిగిందన్నారు. ఈ జాబ్ ప్లేస్‌మెంట్‌లో చివరి సంవత్సరం చదువుతున్న 40 మంది విద్యార్థినులను జన్‌ప్యాక్ట్, టీమ్ లీజ్ కంపెనీలు నియామక ఉత్తర్వులు అందజేశాయి. ఈ కార్యక్రమంలో అనుదీప్ ఫౌండేషన్‌కు చెందిన శ్రీకాంత్, జన్‌ప్యాక్ నుంచి శివ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమేరా సైద్, వ్యాపార గణక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.జయశ్రీ, ఐక్యాక్ కోఆర్డినేటర్ రజనీ పాల్గొన్నారు.